క్లుప్తంగా

ముగిసిన శిక్షణ



సర్టిఫికెట్లతో గ్రామ మంచినీటి సహాయకులు

ఆమనగల్లు: మండల పరిధి రాంనుంతల గ్రామం రైతువేదికలో ఐదు రోజులుగా మిషన్ భగీరథ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రామ మంచినీటి సహాయకుల శిక్షణ కార్యక్రమం సోమవారంతో ముగిసింది. శిక్షణ కార్యక్రమంలో భగీరథ అధికారులు పైపులైన్ల మరమ్మతు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ముగింపు సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ రాజేశ్వర్.. శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో భగీరథ డీఈఈ రామకృష్ణ, ఎంపీడీఓ కుసుమమాధురి, ఏఈలు సందీప్‌కుమార్, వాగ్దేవి, శరత్, శ్రావ్య, కిరణ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

నవరాత్రి ఉత్సవాల్లో వెల్లివిరిసిన మత సామరస్యం



ముస్లిం దంపతులను సన్మానించిన భక్త బృందం సభ్యులు

మాడ్గుల: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఇర్విన్ గ్రామంలో దుర్గ భవాని భక్త బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపం వద్ద మత సామరస్యం వెల్లివిరిసింది. ఆదివారం రాత్రి ముస్లిం దంపతులు రేష్మ, అఫ్జల్ అన్నదానం చేశారు. దీంతో హిందూ ముస్లింల ఐక్యతను చాటేలా కార్యక్రమం నిర్వహించిన అన్న దాతలను స్థానికులు అభినందిస్తూ.. సన్మానించారు.

దుర్గమ్మ సన్నిధిలో మల్‌రెడ్డి రాంరెడ్డి



పూజా కార్యక్రమంలో మల్‌రెడ్డి తదితరులు

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి రాగన్నగూడ శ్రీగణేశ్ శ్రీనివాస రంగాపురం కాలనీలో ఏర్పాటు చేసిన దుర్గామాతను సోమవారం రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి దర్శించుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. పండితుల ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కుంట గోపాల్ రెడ్డి, సామ భీంరెడ్డి, మర్రి మహేందర్ రెడ్డి, కాలనీ అధ్యక్షుడు కాయితి బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

బతుకమ్మ సంబురాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉద్యోగులు

ఇబ్రహీంపట్నం రూరల్: బతుకమ్మ సంబురాలను జయప్రదం చేయాలని తెలంగాణ నాన్‌గెజిటెడ్ ఉద్యోగులు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో బతుకమ్మ పండుగ పోస్టర్‌ను ఆవిష్కరించారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు తమ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్సవంలో మంత్రులు కొండా సురేఖ, సీతక్క పాల్గొంటారని పేర్కొన్నారు.

భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయండి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మాడ్గుల: తహసీల్దార్ కార్యాలయం నూతన భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కాంగ్రెస్ మండల నాయకులు కోరారు. కడ్తాల్ మండల కేంద్రంలో సోమవారం మంత్రి పొంగులేటి.. అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించేందుకు వచ్చారు. ఈ సందర్భంగా మంత్రిని.. పార్టీ మాడ్గుల మండల అధ్యక్షుడు బట్టు కిషన్ రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ప్రభాకర్ రెడ్డి, నాయకులు కొండల్ రెడ్డి, సాయిరెడ్డి కలిసి సన్మానించారు. అనంతరం తహసీల్ కార్యాలయ భవనం కోసం నిధులు కోరుతూ వినతిపత్రం అందజేశారు.



ఆమనగల్లు: శాకాంబరీ దేవి అలంకారంలో దుర్గామాత



కడ్తాల్: లలితా త్రిపుర సుందరిదేవిగా అన్నపూర్ణేశ్వరి



యాచారం: నందివనపర్తిలో లలితా త్రిపుర సుందరిగా జ్ఞాన సరస్వతి



ఇబ్రహీంపట్నం: మహాచండీ దేవిగా రాజరాజేశ్వరి

భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రి ఉత్సవాలు

- వివిధ రూపాల్లో అమ్మవారి దర్శనం
- మహిళల కుంకుమార్చనలు
- భక్తుల ప్రత్యేక పూజలు, హోమాలు
- యాచారంలో సామూహిక బతుకమ్మ సంబురాలు



యాచారం: బతుకమ్మ ఆడుతున్న మహిళలు, యువతులు

ఆమనగల్లు/ఇబ్రహీంపట్నం/కడ్తాల్/యాచారం: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఐదో రోజైన సోమవారం ఆమనగల్లు పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శాకాంబరీ దేవి అలంకారంలో దుర్గామాత, భక్త మార్కండేయస్వామి దేవాలయంలో మహాచండీగా రాజరాజేశ్వరి దేవి, కడ్తాల్ మైసిగండి, శివరామాలయంలో లలితా త్రిపుర సుందరిదేవిగా అన్నపూర్ణేశ్వరి, యాచారం నందివనపర్తిలో సరస్వతి మాత.. లలితా త్రిపుర సుందరి దేవిగా, ఇబ్రహీంపట్నం ఈశ్వరాంజనేయస్వామి దేవాలయంలో మహాచండీ దేవి అలంకరణలో రాజరాజేశ్వరి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆమనగల్లు కన్యకాపరమేశ్వరి సన్నిధిలో భక్తులు హోమం, సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. దుర్గాభవాని యూత్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు వీరబొమ్మ రామ్మోహన్, ప్రధాన కార్యదర్శి బికుమాండ్ల నర్సింహ, కోశాధికారి శ్రీనివాస్, సభ్యులు మంచుకొండ శేఖర్, కండె సుమన్, జగదీశ్వర్, విష్ణు, లక్ష్మయ్య, చంద్రశేఖర్, ఆనంద్, శ్రీనివాస్, కొండయ్య, సిద్ధూ పాల్గొన్నారు.

మహాచండీగా..

ఆమనగల్లు భక్తమార్కండేయస్వామి ఆలయంలో మహాచండి అలంకారంలో రాజరాజేశ్వరిదేవీ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కుసుమమాధురి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మైసిగండిలో..

కడ్తాల్ మండలం మైసిగండి గ్రామం మైసమ్మ దేవత, శివరామాలయంలో కొలువైన మాత అన్నపూర్ణేశ్వరి.. లలితా త్రిపుర సుందరిగా భక్తులను అనుగ్రహించారు. ఈ సందర్భంగా వేద పండితుల మంత్రోచ్ఛారణ మధ్య, కలశ పూజ, విశేష పూజలు, యజ్ఞం, చండి హోమం, అర్చనలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ స్నేహలత, ట్రస్టీ శిరోలి, రామవత్ భాస్కర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



తలకొండపల్లి: లలితా త్రిపుర సుందరిదేవిగా దుర్గమ్మ

నందివనపర్తిలో..

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని యాచారం మండలం నందివనపర్తి గ్రామం శ్రీ జ్ఞాన సరస్వతి ఆలయంలో సరస్వతి మాత.. లలితా త్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి రాఘవేంద్రశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయం ఎదుట మహిళలు సామూహిక బతుకమ్మ ఆడారు.



కడ్తాల్: పూజలు నిర్వహిస్తున్న భక్తులు



ఆమనగల్లు: అమ్మవారి సన్నిధిలో భక్తుల హోమం



ఆమనగల్లు: సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం చేస్తున్న భక్తులు



ఆమనగల్లు: అమ్మవారి పూజా కార్యక్రమంలో ఎంపీడీఓ మాధురి, మహిళలు

వీధి దీపాల ఏర్పాటుకు విరాళం

తలకొండపల్లి: గ్రామంలో వీధి దీపాల ఏర్పాటుకు ఓ వ్యక్తి రూ.10 వేలు విలువ చేసే లైట్లను వితరణ చేశారు. సోమవారం మండల పరిధి చంద్రధన గ్రామ పంచాయతీకి చెందిన సామాజిక వేత్త రమేష్ చారి.. పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్‌కు జీపీ కార్యాలయంలో వాటిని అందజేశారు. విజయదశమిని పురస్కరించుకుని స్ట్రీట్ లైట్లు లేని చోట లైట్లు అమర్చేందుకు తనవంతు సహకారం అందజేసినట్లు దాత పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రవీణ్, రమేష్, అయ్యప్ప, మనోహర్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి రాగన్నగూడ సూరజ్‌నగర్ కాలనీ ఫేజ్ 2 నూతన కార్యవర్గాన్ని సోమవారం స్థానికంగా జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జె.యాదగిరి, ప్రధాన కార్యదర్శి కె.శంకర్, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్, అసోసియేట్ ప్రెసిడెంట్ జి.ఆనంద్, సంయుక్త కార్యదర్శిగా కె.అరుణ్‌కుమార్, కోశాధికారిగా ఎ.యుగేందర్‌లను నియమించారు. అనంతరం నూతన సభ్యులను కౌన్సిలర్ కుంట ఉదయశ్రీ అభినందించారు.

నిర్మాణ రంగంలో వృత్తి నైపుణ్యం అవసరం

కడ్తాల్: నిర్మాణ రంగంలో వృత్తి నైపుణ్యం అవసరమని పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. భవన నిర్మాణ కార్మికులు న్యాక్ ద్వారా ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్), తెలంగాణ భవన నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో మండల పరిధి వంపుగూడలో కొనసాగుతున్న శిక్షణ తరగతులను డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు పోతుగంటి అశోక్‌తో కలిసి సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అనేక కార్యక్రమాలను చేపడుతుందని పేర్కొన్నారు. వారు తమ కాళ్లపై నిలబడేలా ప్రభుత్వం అన్ని రంగాల్లో శిక్షణ ఇస్తుందని వెల్లడించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని వివరించారు. కార్యక్రమంలో సివిల్ ఇన్‌స్ట్రక్టర్ పుష్పాంజలి, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

చదువుతో పాటు ఆటల్లో రాణించాలి

- ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు



క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న ఏసీపీ కేపీవీ రాజు, సీఐ శంకర్‌కుమార్ తదితరులు

యాచారం: చదువుతో పాటు యువత ఆటల్లోనూ రాణించాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు అన్నారు. క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. మండల పరిధి మాల్ గ్రామంలో సోమవారం బట్టు శ్రీనువాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న క్రీడాకారులంతా గ్రామాల్లో పుట్టిపెరిగిన వారేనని, పట్టుదలతో వారు ఆ స్థాయికి చేరుకున్నారని పేర్కొన్నారు. దురలవాట్లకు దూరంగా ఉంటూ, చదువు, ఆటల్లో తమదైన శైలిలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీఐ శంకర్‌కుమార్, యువకులు విజయ్, లింగం, భాస్కర్, మురళీ, లింగం, పెద్దులు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి భవనాలను పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్

కడ్తాల్: మండలంలో అసంపూర్తిగా ఉన్న ప్రభుత్వ భవనాలను పూర్తిచేసి, వినియోగంలోకి తేవాలని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జర్పుల దశరథ్‌నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన బీఆర్ఎస్ నాయకులతో కలిసి మాట్లాడుతూ.. తహసీల్ కార్యాలయ నూతన భవనాన్ని ప్రారంభించేందుకు వచ్చిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో నాటి మంత్రి సబితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సహకారంతో రూ.1.18 కోట్లతో తహసీల్దార్ భవన నిర్మాణానికి భూమిపూజ చేసినట్లు గుర్తు చేశారు. మండల పరిషత్ భవనానికి రూ.50 లక్షలు, మహిళా సమాఖ్య భవనానికి రూ.20 లక్షలు మంజూరు చేసి, పనులు ప్రారంభించనట్లు పేర్కొన్నారు. నిధులు సరిపోక నిర్మాణ పనులు ఆగిపోయాయని తెలిపారు. ఎంపీడీఓ భవనానికి మరో కోటి, సమాఖ్య భవనానికి రూ.30 లక్షలు మంజూరు చేసి, త్వరితగతిన పనులు పూర్తి చేయించాలని కోరారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరారు. సమావేశంలో సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహరెడ్డి, మాజీ ఎంపీటీసీ లచ్చిరామ్‌నాయక్, సింగిల్‌విండో డైరెక్టర్లు వీరయ్య, సేవ్యానాయక్, పార్టీ పట్టణ అధ్యక్షుడు కడారి రామకృష్ణ తదితరులు ఉన్నారు.

దసరా లోపు జీతాలు ఇవ్వండి



ఎంపీడీఓ సరితకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

కందుకూరు: విజయదశమి లోపుగా గ్రామ పంచాయతీ కార్మికులకు జీతాలు ఇవ్వాలని సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ.. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు గుర్తింపు కార్డులు, మాస్కులు, గ్లౌజులు, యూనిఫామ్స్ అందజేస్తామని మూడు నెలల క్రితం ఎంపీడీఓ హామీ ఇచ్చారని, కానీ నేటికీ అమలు చేయలేదని పేర్కొన్నారు. దసరా లోపుగా కార్మికులకు జీతాలతో పాటు, ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. అనంతరం ఎంపీడీఓ సరితకు వినతిపత్రం అందజేశారు. దీనికి స్పందించిన ఎంపీడీఓ.. కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ జీపీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేసినట్లు కార్మికులు తెలిపారు. కార్యక్రమంలో కారోబార్‌లు బాల్‌రాజ్‌గౌడ్, మాధవ్, మిలన్, జంగయ్య, నరసింహ, పాండు, బాలయ్య, కార్మికులు యాదమ్మ, బాలమ్మ, సుగుణమ్మ, పద్మరాణి, నర్సమ్మ, పెంటమ్మ, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

దసరా పండుగను ప్రశాంతంగా జరుపుకోండి

ఏసీపీ కేపీవీ రాజు



స్థానికులతో మాట్లాడుతున్న ఏసీపీ

యాచారం: దసరా పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా జరుపుకోవాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు కోరారు. మండల కేంద్రంలో సోమవారం రాత్రి స్థానికులతో మాట్లాడారు. యోగక్షేమాలు తెలుసుకున్నారు. అన్ని మతాల వారు కలిసి మెలిసి ఉండాలని సూచించారు. వాహనదారులను ఆపి, ఇంటికి తాళాలు వేసి వెళ్తున్నారా, ప్రయాణంలో జాగ్రత్త, వేగంగా వెళ్లవద్దని చెప్పారు. కార్యక్రమంలో సీఐ శంకర్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులకు దుస్తుల పంపిణీ

తుక్కుగూడ: కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ బరిగెల హేమలత అన్నారు. విజయ దశమి సందర్భంగా సోమవారం మున్సిపల్ కార్యాలయంలో కార్మికులకు, కమిషనర్ వెంకట్రామ్‌తో కలిసి దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శివకుమార్, జపాల భావన, సప్పిడి లావణ్య, రాజమౌని రాజు, బాకీ విలాస్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాయన్న విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమిపూజ

మీర్‌పేట: పండుగ సాయన్న విగ్రహ ప్రతిష్ఠాపనకు ముదిరాజ్ మహాసభ మీర్‌పేట కార్పొరేషన్ ఆధ్వర్యంలో సోమవారం చందన చెరువు కట్టపై భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ఎడ్ల మల్లేశ్ ముదిరాజ్ మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల అభివృద్ధికి సాయన్న కృషి చేశారని పేర్కొన్నారు. నిజాం పాలనలో పీడిత వర్గాలకు అండగా నిలిచిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ఆయన విగ్రహాన్ని త్వరలో ఆవిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు అనిల్‌యాదవ్, సిద్దాల బీరప్ప, గజ్జెల రాంచందర్, స్థానిక నాయకులు పోరెడ్డి భాస్కర్‌రెడ్డి, యాదగిరి ముదిరాజ్, లక్ష్మణ్ ముదిరాజ్, రాజు, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి

- సీఐ బద్యనాథ్ చౌహాన్



బ్యాటింగ్ చేసి క్రికెట్ టోర్నీ ప్రారంభిస్తున్న సీఐ బద్యనాథ్

ఆమనగల్లు: క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్, ఎస్ఐ వెంకటేశ్ అన్నారు. పట్టణంలోని అయ్యప్పకొండ వద్ద సోమవారం ఆమనగల్లు ప్రీమియంలీగ్ సీజన్ 2 క్రికెట్ టోర్నీని సీఐ, ఎస్ఐలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆటలతో శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం కలుగుతుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తరచూ క్రీడా పోటీలు నిర్వహించి, మట్టిలో మాణిక్యాలను వెలికితీయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాము, టోర్నీ నిర్వాహకులు టిల్లు యాదవ్, శివసూర్య, కొమ్ము ప్రసాద్, సైదులు, గణేశ్, నరేశ్, అశోక్, గోపి, నాయకులు కృష్ణనాయక్, ఒగ్గు మహేశ్, దేవేందర్, బాస్కర్, మల్లేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలు సరే.. ఔషధాలు ఏవి?



మండల ప్రాథమిక ఆస్పత్రి



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ఏఎన్ఎంలు

- పీహెచ్‌సీని వేధిస్తున్న మందుల కొరత
- ఫార్మసిస్ట్ పోస్టు ఖాళీ
- ఇబ్బంది పడుతున్న రోగులు
- 108 వాహనం లేక.. అవస్థలు

మాడ్గుల: పేరుగొప్ప.. ఊరుదిబ్బలా మారింది మాడ్గుల మండల పరిస్థితి. పేరుకు 34 గ్రామాలు ఉన్న మండలమే అయినా.. అనేక సమస్యలు వెంటాడుతున్నాయి. ముఖ్యంగా మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్య సేవలు ఉన్నా.. మందుల కొరత వేధిస్తోంది. నెల రోజులుగా ఆస్పత్రిలో డాక్టర్లు ఓపీ సేవలు అందిస్తున్నా.. సరిపడా మందులు లేకపోవడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. ఉన్న మందులు ఇవ్వటానికి ఫార్మాసిస్ట్ లేక, ఏఎన్ఎంలు, సిస్టర్లు పంపిణీ చేస్తున్నారు. అసలే సీజనల్ వ్యాధుల కాలం.. ఆపై వెంటాడుతున్న మందుల లేమితో.. చేసేది లేక, వైద్యమో నారాయణ అంటూ ప్రైవేటు ఆస్పత్రులకు పరుగు తీయాల్సిన దుస్థితి ఏర్పడిందని ప్రాంత ప్రజలు పేర్కొంటున్నారు. అత్యవసర పరిస్థితులు ఏర్పడితే.. 108 అంబులెన్స్ కూడా లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

మెడికల్ షాప్‌నకు పరుగు

మండల పరిధిలో సుమారు 50వేలకు పైగా జనాభా ఉంది. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో నిత్యం 150 నుంచి 200 వరకు ఓపీ సేవలు పొందుతుంటారు. కానీ అవసరమైన మందులు లేకపోవడంతో.. ప్రవేట్ మెడికల్ షాప్‌ల్లో కొనుగోలు చేస్తున్నట్లు రోగులు పేర్కొంటున్నారు. మందుల గురించి వైద్యాధికారులను అడిగినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. పేరుకు మండల కేంద్రమే అయినా.. సరైన వైద్య సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నామని, అధికారులు స్పందించి అవసరమైన ఔషధాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. పీహెచ్‌సీలో నెలకొన్న సమస్యల గురించి వైద్యుడు మోహన్‌ను వివరణ కోరగా.. మందుల కొరత గురించి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. 108 వాహనం గురించి వివరించినట్లు పేర్కొన్నారు.